సాక్షి చిత్తూరు

శనివారం । 18 । అక్టోబర్ । 2025



రైతు సభను అపహాస్యం..

పూతలపట్టులో చేపట్టిన మామిడి రైతు ఆక్రందన సభను అపహాస్యం చేయడం విడ్డూరమని రైతు నాయకులు ధ్వజమెత్తారు. - 10లో



వసూళ్ల 'పండగ'

దీపావళి పండుగ కూటమి నేతలు, అగ్నిమాపక శాఖ అధికారులకు కాసులు కురిపిస్తోంది. - 10లో



పంట పొలాలపై దాడి

పులిచెర్ల మండలంలోని పంట పొలాలపై ఏనుగులు దాడులకు తెగబడ్డాయి. చేతికొచ్చిన పంటలను సర్వనాశనం చేశాయి. - 10లో

న్యూస్‌రీల్

నాణ్యమైన మద్యాన్ని గుర్తించండి



పరిశీలిస్తున్న అధికారులు

చిత్తూరు అర్బన్: కల్తీ లేనటువంటి నాణ్యమైన్య మద్యాన్ని మొబైల్ యాప్ ద్వారానే గుర్తించ వచ్చని జిల్లా ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ డిప్యూటీ కమిషనర్ విజయశేఖర్ అన్నారు. శుక్రవారం చిత్తూరులోని మద్యం దుకాణాల్లో ఎక్సైజ్ సురక్ష యాప్ పనితీరును మద్యం ప్రియులకు వివరించారు. మొబైల్ యాప్‌లో ఎక్సైజ్ సురక్ష యాప్ డౌన్లోడ్ చేసుకుని మద్యం బాటిల్ వద్ద ఉన్న స్కాన్ చేస్తే నాణ్యమైన మద్యం వివరాల మొత్తం మొబైల్‌లోనే చూపిస్తుందన్నారు. ఇలాంటి వివరాలు రాకపోతే వెంటనే అధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఎక్సైజ్ ఈఎస్ శ్రీనివాస్, అర్బన్ సీఐ శ్రీహరిరెడ్డి పాల్గొన్నారు.

కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం



ఆలయ గోడలకు సుగంధ ద్రవ్యాలను ప్రోక్షణ చేస్తున్న ఆలయ అధికారులు, సిబ్బంది

తిరుపతి కల్చరల్: శ్రీకోదండరామస్వామి ఆలయంలో ఈనెల 20న దీపావళి ఆస్థానం నేపథ్యంలో శుక్రవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం భక్తిప్రపత్తులతో నిర్వహించారు. ఆలయ ప్రాంగణం, గోడలు, పైకప్పు, పూజాసామగ్రి మొదలైన వాటిని నీటితో శుద్ధి చేసిన అనంతరం నామకోపు, శ్రీచూర్ణం, కస్తూరి పసుపు, పచ్చాకు, గడ్డ కర్పూరం, గంధం పొడి, కుంకుమ, కిచిలీగడ్డ తదితర సుగంధ ద్రవ్యాలు కలిపిన పవిత్ర మిశ్రమాన్ని ఆలయం అంతటా ప్రోక్షణం చేశారు. ఆ తర్వాత ఉదయం 10.30 గంటల నుంచి భక్తులను దర్శనానికి అనుమతించారు. కార్యక్రమంలో ఆలయ డెప్యూటీ ఈఓ నాగరత్న, సూపరింటెండెంట్ మునిశంకరన్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ సురేష్‌బాబు, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనానికి 12 గంటలు

తిరుమల: తిరుమలలో శుక్రవారం భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 30 కంపార్టుమెంట్లు నిండాయి. గురువారం అర్ధరాత్రి వరకు 61,521 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 25,101 మంది భక్తులు తలనీలాలు అర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.4.66 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనం లభిస్తోంది. దర్శన టిక్కెట్లు లేనివారు స్వామిని దర్శించుకోవడానికి 12 గంటల సమయం పడుతోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది. ఇదిలా ఉంటే సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలోకి వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తిచేస్తోంది. కేటాయించిన సమయానికంటే ముందు వెళ్లిన వారిని క్యూలోకి అనుమతించరని స్పష్టం చేసింది.

'ప్రజల గొంతుకగా నిలిచే పత్రికా రంగాన్ని అణగదొక్కాలనుకోవడం అవివేకం. ఒక పత్రికపైనే కక్ష సాధింపులకు పాల్పడి వేధింపులకు దిగడం బాధాకరం. ఇది ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు లాంటిది. నిరంకుశత్వానికి పరాకాష్ట. ఇలాంటి చర్యలు మానుకోవాలి. 'సాక్షి'పై వేధింపులు.. అక్రమ కేసులు వెంటనే ఉపసంహరించాలి. లేకుంటే పోరాటాలు ఉధృతం చేస్తాం. న్యాయం జరిగేవరకు పోరాడుతూనే ఉంటాం' అంటూ జర్నలిస్ట్ సంఘాల నాయకులు స్పష్టం చేశారు. తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో నిరసనలు మిన్నంటించారు. 'సాక్షి'పై కక్షగట్టడమేంటని ప్రశ్నించారు. తప్పొప్పులు జరిగితే ఖండించాల్సింది పోయి.. విచారణ పేరుతో భయభ్రాంతులకు గురిచేయడం, అక్రమ కేసులు బనాయించడం భావ్యం కాదన్నారు. పోలీసుల తీరును ఎండగట్టారు.



చిత్తూరు కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న పాత్రికేయులు

ఉరిమిన కళ్లు..
బిగిసిన పిడికిళ్లు!

ప్రశ్నించే కలానికి సంకెళ్లా?

- ఏపీయుడబ్ల్యూజే నాయకుల ఆధ్వర్యంలో నిరసన
- అక్రమ కేసులపై గళమెత్తిన పాత్రికేయులు



చిత్తూరు అర్బన్ : వ్యవస్థలో లోటుపాట్లను ఎత్తి చూపిస్తున్న పత్రికలపై కేసులు నమోదు చేయడం.. వేధింపులకు గురిచేయడం.. ప్రశ్నించే కలానికి సంకెళ్లు వేయడమేనని ఏపీయూడబ్ల్యూజే, చిత్తూరు ప్రెస్ క్లబ్ నాయకులు ధ్వజమెత్తారు. శుక్రవారం చిత్తూరు కలెక్టరేట్ వద్ద ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్(ఏపీయూడబ్ల్యూజే), చిత్తూరు ప్రెస్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో జర్నలిస్టులు నిరసన కార్యక్రమం చేపట్టారు. పాత్రికేయులపై కేసులు పెట్టడం దారుణమని ఎండగట్టారు. ప్రజాస్వామ్యమా.. నిరంకుశమా..? అంటూ నినాదాలు చేశారు. అక్రమ కేసులు ఎత్తివేయాలని, వేధింపులు మానుకోవాలని డీఆర్ఓ మోహన్ కుమార్‌కు వినతి పత్రం అందజేశారు.



చిత్తూరు డీఆర్ఓకు వినతిపత్రం అందజేస్తున్న ఏపీయూడబ్ల్యూజే, ప్రెస్ క్లబ్ సభ్యులు

ఖండించాల్సింది పోయి.. కేసులా?

ఏపీడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు లోకనాథన్ మాట్లాడుతూ... అన్నమయ్య జిల్లా, ములకలచెరువులో వెలుగు చూసిన నకిలీ మద్యం కుంభకోణం పై ఇటీవల సాక్షి దినపత్రికలో వరుస వార్త కథనాలు ప్రచురితమయ్యాయన్నారు. ఇందులో ఏవైనా పొరపాట్లు ఉంటే.. పాలకులు గానీ.. అధికారులు గానీ ఖండించాల్సింది పోయి పత్రికపై కక్ష సాధింపు చర్యలకు దిగడం భావ్యం కాదన్నారు. సాక్షి ప్రధాన పత్రిక కార్యాలయానికి వెళ్లి సోదాలు చేయడం, ఎడిటర్‌కి నోటీసులు ఇచ్చి వేధించడం, రాష్ట్రంలోని పలు జిల్లాల్లో సాక్షి పాత్రికేయులపై కేసుల నమో దు చేయడం బాధాకరమన్నారు. ఇది ప్రజాస్వామ్యంలో ఏమాత్రం ఆమోదయోగ్యం కాదన్నారు.

భావ వ్యక్తీకరణ లేదా?

జిల్లా ప్రధాన కార్యదర్శి మురళీకృష్ణ మాట్లాడుతూ పత్రికలపై ఇలాంటి చర్యలు ప్రజల్లో తప్పుడు సంకేతాలు తీసుకెళ్లడంతో పాటు.. భారత రాజ్యాంగం కల్పించిన భావవ్యక్తీకరణ హక్కును కూడా కాలరాయడమే అవుతుందన్నారు. వెంటనే సాక్షి ఎడిటర్‌పైన, పాత్రికేయులపైన పెట్టిన కేసులను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. దీనిని ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ చిత్తూరు జిల్లా శాఖ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. ఇలాంటి చర్యలు పునరావృతం కాకుండా ప్రభుత్వం – పోలీసులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. అనంతరం డీఆర్‌ఓ మోహన్‌కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. ప్రభుత్వం దృష్టికి జర్నలిస్టుల సమస్యలను, అక్రమ కేసుల తొలగింపు అంశాన్ని తీసుకెళ్లాలని కోరారు. కార్యక్రమంలో చిత్తూరు ప్రెస్‌క్లబ్ సెక్రటరీ కాశీశ్వర్‌రెడ్డి, ట్రెజరర్ అనిల్, ఉపాధ్యక్షుడు శివప్రసాద్, కమిటీ సభ్యులు రాజేష్, అయ్యప్పనాయుడు, ఏపీడబ్ల్యూజే ఆర్గనైజింగ్ సెక్రటరీ కేఎం.అశోక్ కుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు శివకుమార్, సభ్యులు సురేష్, తవణంపల్లి ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు జగన్నాథం, సీనియర్ పాత్రికేయులు కృష్ణసింగ్, జీకే.శివ, చిరంజీవి, పూతలపట్టు నియోజకవర్గ రిపోర్టర్లు శివకుమార్, నాని, గుణశేఖర్, గంగాధరనెల్లూరు నియోజకవర్గం రిపోర్టర్లు తేజ, నరేష్ పాల్గొన్నారు.



తిరుపతిలో గాంధీ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న జర్నలిస్టులు

కలంపై కక్ష

తిరుపతి అర్బన్ : 'సీఎం చంద్రబాబు జర్నలిస్టులతో రాజకీయం చేయ డం మంచి పద్ధతి కాదు.. రాష్ట్ర చరిత్రలో ఓ వార్త ప్రచురించారని ఏకంగా ఎడిటర్‌పై కేసు పెట్టడం ఇప్పటి వరకు జరగలేదు' అంటూ తిరుపతి పాత్రికేయులు కూటమి సర్కార్ తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లో సాక్షి కార్యాలయానికి పోలీసులు వెళ్లడం.. ఎడిటర్ ధనంజయరెడ్డిని ప్రశ్నించడంపై వారు మండిపడ్డారు. అక్రమ కేసులకు వ్యతిరేకంగా తిరుపతిలోని బస్టాండ్ సమీపంలో ఉన్న గాంధీ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు.

అక్రమ కేసులను ఉపసంహరించుకోవాలి

సమాజంలో జరుగుతున్న మంచితో పాటు చెడును తెలియజేయడం ద్వారా అధికార యంత్రాంగం తప్పులను సరిదిద్దుకునే అవకాశం ఉంటుందనే ఉద్దేశంతో పత్రికలు పనిచేస్తున్నాయని గుర్తుచేశారు. అయితే ప్రభుత్వ ఆలోచన మాత్రం మరోలా ఉందని మండిపడ్డారు. తప్పొప్పులతో సంబంధం లేకుండా ప్రభుత్వానికి జర్నలిస్టులు భజన చేయాలని భావించడం మంచి పద్ధతి కాదని హితవు పలికారు. సాక్షి ఎడిటర్‌పై పెట్టిన అక్రమ కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం ఈస్ట్ పోలీస్ స్టేషన్‌లో డీఎస్పీకి వినతిపత్రం అందజేశారు. తిరుపతి ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు ఆర్.మురళి, కార్యదర్శి పి.బాలచంద్ర, ఏపీ ఫొటో జర్నలిస్టు అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కే.గిరిబాబు, ఏపీయూడబ్ల్యూజే కార్యవర్గ సభ్యుడు మబ్బు నారాయణరెడ్డి, సీనియర్ జర్నలిస్టులు నగేష్, విజయయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతంలో గ్రామ కమిటీలు కీలకం



నాయకులతో ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

సదుం: పార్టీని బలోపేతం చేయడంలో గ్రామ కమిటీ సభ్యులు కీలకంగా పనిచేయాలని వైఎస్సార్ సీపీ రీజనల్ కో–ఆర్డినేటర్, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. ఆయన శుక్రవారం మండలంలోని అమ్మగారిపల్లెలో పర్యటించారు. ఇటీవల నూతనంగా ఎంపికైనా పార్టీ గ్రామ కమిటీల విధి నిర్వహణపై నాయకులకు సూచనలు చేశారు. ఆయన మాట్లాడుతూ పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడంలో కమిటీ సభ్యులు కీలకంగా పనిచేసేలా చూడాలన్నారు. కూటమి ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ఎప్పటికప్పుడు ప్రజలకు తెలియజేయాలని పేర్కొన్నారు. అనంతరం రెస్టారెంట్ ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, జెడ్పీటీసీ సోమశేఖర్ రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, పార్టీ మండల కనీ్వనర్ రెడ్డెప్ప రెడ్డి, ఐటీ వింగ్ జిల్లా అధ్యక్షుడు ప్రకాశ్ రెడ్డి, నారాయణ రెడ్డి, రమేష్‌రెడ్డి, ఎంపీటీసీ మల్లికార్జున, పురుషోత్తంరెడ్డి, శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దళితుల సమస్యలకు సత్వర పరిష్కారం



మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ



పాల్గొన్న కమిటీ సభ్యులు, అధికారులు, పోలీసులు

- ఎస్సీ కాలనీ శ్మశానవాటికల అభివృద్ధికి నిధులు
- కాణిపాకం ఆలయ శానిటేషన్ అవుట్‌సోర్సింగ్ సిబ్బంది పై విచారణ
- త్వరలో చిత్తూరు గాంధీ సర్కిల్‌లో అంబేడ్కర్ విగ్రహం
- కలెక్టరేట్‌లోనిఘా, పర్యవేక్షణ కమిటీ సమావేశం
- పాల్గొన్న కలెక్టర్, ఎస్పీ, ప్రజాప్రతినిధులు

చిత్తూరు కలెక్టరేట్ : దళితుల సమస్యలను సత్వరం పరిష్కరించేందుకు అన్ని శాఖల అధికారులు చర్యలు చేపట్టాలని కలెక్టర్ సుమిత్ కుమార్‌గాంధీ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లా నిఘా, పర్యవేక్షణ కమిటీ (డీవీఎంసీ) సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా స్థాయి నిఘా, పర్యవేక్షణ కమిటీ సభ్యులు జిల్లాలోని అన్ని సంక్షేమ వసతి గృహాలను సందర్శించి సమస్యలను గుర్తించి నివేదికలు ఇవ్వాలన్నారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి జిల్లా స్థాయిలో ఈ కమిటీ సమావేశం నిర్వహిస్తామన్నారు. కాణిపాకం ఆలయంలో పనిచేస్తున్న అవుట్‌సోర్సింగ్ శానిటేషన్ సిబ్బందిపై పలు ఫిర్యాదులు వచ్చాయని, వాటిని విచారించేందుకు చిత్తూరు ఆర్‌డీవోను విచారణ అధికారిగా నియమించామని తెలిపారు. రెండు రోజుల్లో విచారణ నివేదికలు అందిన వెంటనే చర్యలు చేపడుతామన్నారు. జిల్లాలో 60 వేల మంది గిరిజనులు ఉన్నారని, ప్రతి ఒక్కరికీ ఆధార్ ఉండేలా ప్రత్యేక క్యాంపులు నిర్వహిస్తున్నామన్నారు. జిల్లాలోని 50 గ్రామ పంచాయతీలలో గిరిజనుల సమస్యలపై సర్వే నిర్వహించామన్నారు. చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీల సమస్యలను అధికారులు చిత్తశుద్ధితో పరిష్కరించాలన్నారు. జిల్లాలోని ఎస్సీ కాలనీలలో శ్మశానవాటికల అభివృద్ధికి ఎంపీ నిధుల నుంచి రూ.10లక్షలు మంజూరు చేస్తామన్నారు. జెడ్పీ నిధుల నుంచి రూ.20 లక్షలు మంజూరు చేస్తామని తెలిపారు. సభ్యుల ఆమోదంతో చిత్తూరు నగరంలోని గాంధీ విగ్రహం పక్కనే అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఎస్పీ తుషార్ డూడీ మాట్లాడుతూ ఏప్రిల్ నుంచి ఆగస్టు వరకు నమోదైన ఎస్సీ, ఎస్టీ కేసులలో 28 విచారణ చేసి 42 మంది బాధితులకు రూ.37,50,000 చెల్లించినట్టు తెలిపారు. సమావేశంలో చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్, డీఆర్‌వో మోహన్‌కుమార్, ఆర్‌డీవోలు శ్రీనివాసులు, భవాని, అనుపమ, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ డీడీ విక్రమ్‌కుమార్‌రెడ్డి, డీవీఎంసీ సభ్యులు మునీంద్రనాయక్, రాజ్‌కుమార్, వరలక్ష్మి, జీవీరమణ, శేషాద్రి, మునస్వామి, రఘురాం తదితరులు పాల్గొన్నారు.

మహిళలను కించపరచడమా..సిగ్గు సిగ్గు



ఎమ్మెల్యే థామస్‌పై పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న కృపాలక్ష్మి



మీడియాతో మాట్లాడుతున్న కృపాలక్ష్మి

– ఎమ్మెల్యే థామస్‌పై చర్యలు తీసుకోండి

కార్వేటినగరం : సభ్య సమాజం తలదించుకునేలా మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన గంగాధరనెల్లూరు ఎమ్మెల్యే డాక్టర్ థామస్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని ఆ నియోజకవర్గ సమన్వయకర్త కృపాలక్ష్మి డిమాండ్ చేశారు. ఈ మేరకు మహిళలతో వెళ్లి కార్వేటినగరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ తెలుగు ఆత్మగౌరవం, మహిళలే మాకు ఆరాధ్య దైవం అని గొప్పలు చెప్పుకునే టీడీపీ ఎమ్మెల్యేలు ఒక మహిళ అయిన తనను పబ్లిక్‌లో కట్టుబొట్టు, వస్త్రధారణ పై అవహేళన చేస్తూ అవమానించడం బాధాకరమన్నారు. నియోజకవర్గ అభివృద్ధిపై దృష్టి సారించక, మహిళలు ధరించే చీర, బొట్టు, నగలపై ఎమ్మెల్యే థామస్ అవహేళన చేస్తూ మాట్లాడడం దారుణమన్నారు. తన తండ్రి, మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామిపైన, తనపైన అనుచితంగా మాట్లాడడం మంచి పద్ధతి కాదన్నారు. దీనిపై జాతీయ ఎస్సీ, ఎస్టీ కమిషన్, జాతీయ మహిళా కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. కూటమి ప్రభుత్వంలో రాష్ట్ర వ్యాప్తంగా ఎక్కడ చూసినా మహిళలపై లైంగిక దాడులు జరుగుతున్నాయన్నారు. రాష్ట్రంలో పురుషులతో సమానంగా మహిళలకు సమాన హోదా రావాలంటే మళ్లీ జగనన్న ప్రభుత్వం రావాలని కోరారు. కార్యక్రమంలో మండల పార్టీ కన్వీనర్లు శేఖర్‌రాజు, మణి, రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శి చందురాజు, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు రాధికరెడ్డి, జెడ్పీటీసీలు సుకుమార్, అన్బులగన్, సర్పంచ్ ధనుంజయవర్మ, నాయకులు వెంకటరత్నం, ధనశేఖర్‌యాదవ్, తౌకిర్‌ఖాన్, మహిళ నాయకురాలు మోహనకుమారి తదితరులు పాల్గొన్నారు.

మీకు చేతనైంది చేసుకోండి

- ఓ మద్యం షాపు లైసెన్సు దారునిపై పోలీసుల దురుసు ప్రవర్తన
- మరో వీడియో వైరల్
- సంచలన ఘటనలకు అడ్డాగా పూతలపట్టు!



సాక్షి టాస్క్‌ఫోర్స్: మద్యం షాపును టెండర్‌లో దక్కించుకున్న లైసెన్సుదారునిపై పోలీసులు దురుసుగా ప్రవర్తించిన ఘటన పూతలపట్టు మండలంలో చోటుచేసుకుంది. పూతలపట్టు పోలీసు స్టేషన్లో వారం క్రితం జరిగిన ఈ ఘటనకు సంబంధించిన వీడియో ఒకటి వైరల్‌గా మారింది. దీంతో అసలు పూతలపట్టులో ఏం జరుగుతుందో తెలియక అటు పాలకులు, ఇటు ప్రభుత్వాధికారులు తలలు పట్టుకుంటున్నారు. అసలు ఆ వీడియోలో ఏముందంటే.. 'ఒక లైసెన్సు దారునిపై ఇంత కేవలంగా మాట్లాడుతారా? మండలంలో మిగిలిన మద్యం షాపుల యజమానులు మాత్రం బెల్టు షాపులకు మద్యం సరఫరా చెయ్యొచ్చు. వాళ్లను మాత్రం వదిలేయొచ్చు. మా షాపు నుంచి బెల్టు షాపులకు పంపిస్తే మాత్రం దాడులకు తెగబడుతున్నారు. ఇదెక్కడి న్యాయం.. ప్రతి నెలా మీరు మా నుంచి మామూళ్లు తీసుకుంటున్నారు కదా. ఇదెక్కడి న్యాయం సార్. సమన్యాయం పాటించండి. కావాలనే మాపై నాలుగు సార్లు దాడులు చేశారు. మిగిలిన వాటిపై ఎందుకు చెయ్యడం లేదు. ఒక పోలీసుగా మీరు న్యాయం చేయాలి. మీరు చెప్పినట్లుగానే మేము చేస్తు న్నాం కదా. కానీ మాపై ఇలా కక్ష కట్టడం భాగాలేదు సార్. ఈ విషయంపై మీతో మాట్లాడాలని స్టేషన్‌కు వస్తే బయటకి పోరా అని అంటారా?. పోలీసు స్టేసన్ ఉన్నది మా సమస్యలు చెప్పుకుని వాటిని పరిష్కరిస్తారని. కానీ మీరేం చేస్తున్నారు. ఓ వర్గానికి కొమ్ముకాస్తారా. ఈ విషయంపై ఐజీ, డీఐజీకి ఫిర్యాదు చేస్తాం'.. అని రంగంపేట క్రాస్‌లో ఉన్నటువంటి ఓ మద్యం షాపు యజమాని పూతలపట్టు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. దీంతో అక్కడే ఉన్న ఓ పోలీసు మీకు చేతనయ్యింది చేసుకోండి.. మమ్మల్ని ఏమీ చెయ్యలేరు అని వారిని బెదిరించాడు. ఈ ఉదంతంపై ఇప్పుడు పూతలపట్టులో చర్చనీయాంశంగా మారింది. మండలంలో మునుపెన్నడూ లేని కొత్త సంప్రదాయానికి తెర లేవడంతో సంచలన ఘటనలకు పూతలపట్టు అడ్డాగా మారింది. సామాన్య ప్రజల్లో సైతం భయాందోళన నెలకొంది. కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి ఇలాంటి ఘటనలు పెరుగుతుండడం ఆందోళన కలిగిస్తోంది.



బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.1,34,290
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.12,092
వెండి:	
హోల్‌సేల్ ధర (కిలో)	రూ.1,82,000
రిటైల్ వెండి గ్రాము	రూ.191.00

క్లుప్తంగా

కుటుంబ కలహాలతో..

పుంగనూరు: కుటుంబ కలహాలతో ఓ వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన మండలంలోని బండ్లపల్లెలో శుక్రవారం చోటుచేసుకుంది. గ్రామస్తుల కథనం.. మండలంలోని బండ్లపల్లెకి చెందిన నారాయణరెడ్డి కుమారుడు పి.కృష్ణారెడ్డి(50) గత కొద్ది రోజులుగా కుటుంబ కలహాలతో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. దీన్ని గమనించిన కుటుంబ సభ్యులు హుటాహుటిన స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

రైలు ఢీకొని గుర్తుతెలియని వృద్ధురాలి మృతి

కుప్పం రూరల్: రైలు ఢీకొని గుర్తుతెలియని వృద్ధురాలు మృతిచెందిన ఘటన కుప్పం పట్టణ సమీపంలోని డి.కె.పల్లి వద్ద శుక్రవారం చోటుచేసుకుంది. రైల్వే హెడ్ కానిస్టేబుల్ రమేష్ కథనం.. సుమారు 65 సంవత్సరాలు వయసున్న మహిళను శుక్రవారం ఉదయం వీక్లి స్పెషల్ రైలు ఢీ కొట్టింది. దీంతో వృద్ధురాలు అక్కడికక్కడే మృతిచెందింది. ఎర్రటి స్వెట్టర్, తెలుపు, నీలం, ఎర్ర రంగు కలబోసిన చీర కట్టుకుని ఉంది. ఏదైనా వివరాలు తెలిస్తే 9000716436, 8074088806 నంబర్లలో సంప్రదించాలని హెడ్ కానిస్టేబుల్ కోరారు. వృద్ధురాలి మృతదేహాన్ని కుప్పం ఏరియా ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు పేర్కొన్నారు.

21న లోకల్ హాలిడే ప్రకటించాలి



ఏడీకి వినతిపత్రం అందజేస్తున్న ఏపీటీఎఫ్ 257 నాయకులు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలకు ఈ నెల 21వ తేదీన లోకల్ హాలిడే ప్రకటించాలని ఏపీటీఎఫ్ 257 జిల్లా అధ్యక్షుడు జగదీష్ కోరారు. ఈ మేరకు ఆ సంఘ నాయకులు శుక్రవారం డీఈవో కార్యాలయంలో ఏడీ–1 సుకుమార్‌కు వినతిపత్రం అందజేశారు. జిల్లాలో ఈనెల 21న కేదారి వ్రతం నిర్వహించుకుంటారని, పండుగ ప్రాధాన్యత మేరకు లోకల్ హాలిడే ప్రకటించాలన్నారు. ఆ సంఘం మాజీ జిల్లా అధ్యక్షుడు గోపీనాథ్, జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ పాల్గొన్నారు.



చిత్తూరులో ఏర్పాటైన తాత్కాలిక టపాసుల షాపులు



చిత్తూరు అగ్నిమాపక శాఖ కార్యాలయం

వసూళ్ల పండగ!

- చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో టపాసుల దుకాణాలకు ఆమ్యామ్యాలు
- అందినకాడికి దోచుకుంటున్న కూటమి నేతలు, అధికారులు
- దీపావళిని కాసుల పండుగగా మార్చేసిన అగ్నిమాపకశాఖ
- లంచం ఇవ్వకపోతే కొర్రీల పేరుతో ఇబ్బందులు

చిత్తూరు కలెక్టరేట్ : దీపావళిని కూటమి నేతలు, అధికారులు కాసుల వసూళ్ల పండుగా మార్చేశారు. టపాసుల దుకాణాలకు నిబంధనలను పక్కాగా పాటించినా తమ చేతులు తపడకుంటే అనుమతులు జారీచేసేది లేదని అగ్నిమాపకశాఖ అధికారులు తెగేసి చెబుతున్నారు. దీపావళి సందర్భంగా చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో ఏర్పాటు చేస్తున్న తాత్కాలిక దుకాణాల ఏర్పాటులో చేతివాటం ప్రదర్శిస్తున్నారు. అధికారుల తీరు ఇలా ఉంటే.. దుకాణాల యజమానులు మాత్రం అడిగినంత లంచం ఇచ్చి అందినకాడికి దోచుకుందామనే యోచనలో ఉన్నట్టు తెలుస్తోంది.

రెండు జిల్లాల్లోనూ లంచాల పర్వం

చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో దాదాపు 283 వరకు తాత్కాలిక టపాసుల దుకాణాలను ఏర్పాటు చేస్తున్నారు. టపాసుల విక్రయాల్లో మార్జిన్ 50 శాతం కంటే ఎక్కువగా ఉండడంతో తాత్కాలిక దుకాణాలు ఏర్పాటుకు పోటీ పెరిగింది. నిబంధనలు పాటించకున్నా మామూళ్లు ఇస్తే ఏమైనా చేసుకోవచ్చని, ఏ రేట్లకైనా అమ్ముకోవచ్చనే ఆలోచనలో ఉన్నారు. దీంతో ఈ ఏడాది దుకాణాల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. చిత్తూరు జిల్లా కేంద్రంలోని అగ్నిమాపక శాఖలో ఇద్దరు అధికారులకు రెగ్యులర్ దుకాణాలకు ఒక్కొక్క ఏడాదికి రూ.10 వేల చొప్పున ఐదేళ్లకు రూ.50 వేలు వసూలు చేస్తున్నట్టు సమాచారం. తాత్కాలిక దుకాణాలకు ఒక్కొక్కరి నుంచి రూ.25 వేల నుంచి రూ.30 వేల వరకు లంచం డిమాండ్ చేస్తున్నారని నిర్వాహకులు చెబుతున్నారు. తిరుపతి జిల్లా కేంద్రంలో తాత్కాలిక టపాసుల దుకాణాలకు అనుమతులు కావాలంటే ప్రతి షాపునకు రూ.25 వేల చొప్పున స్థానిక కూటమి ప్రజాప్రతినిధికి ముట్టుజెప్పుకోవాల్సిందే. దీంతో పాటు అగ్నిమాపక, ఇతర శాఖల అధికారులకు సైతం అదనంగా లంచం ఇచ్చుకుంటేనే అనుమతులు దక్కే పరిస్థితి నెలకొంది.

తనిఖీలు తూచ్

చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో సాగుతున్న అక్రమ టపాసుల వ్యాపారాలను అరికట్టడంతో పాటు అనుమతులు జారీచేస్తున్న ఆయా శాఖల్లో జరుగుతున్న లంచగొండుతనాన్ని అరికట్టడంలో కలెక్టర్లు ప్రత్యేక దృష్టి వహించాల్సిన అవసరం ఉంది. సేల్స్ ట్యాక్స్ అధికారులు ఎలాంటి తనిఖీలు చేపట్టకపోవడం విమర్శలకు తావిస్తోంది. చిత్తూరు, తిరుపతి జిల్లాల్లోని టపాసుల గోడౌన్లలో ఎంత మేరకు నిల్వలు ఉన్నాయి.. ఎంత మొత్తానికి ట్యాక్స్‌లు చెల్లించారు..? అన్న విషయాలను అధికారులు పట్టించుకోవడం లేదు.

ముడుపులిస్తేనే అనుమతి

టపాసుల దుకాణాలను ఏర్పాటు చేసుకునే వారు రెవెన్యూ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలి. విద్యుత్, అగ్నిమాపక, శానిటేషన్, మున్సిపాలిటీ, నగరపాలక శాఖల నుంచి ఎన్‌వోసీ (నో అబ్జెక్షన్ సర్టిఫికెట్) తీసుకోవాలి. పెట్రోలియం అండ్ ఎక్స్‌ప్లోజివ్ సేఫ్టీ ఆర్గనైజేషన్ నిబంధనలకు అనుగుణంగా వివిధ శాఖల అధికారుల సమన్వయంతో అనుమతులను జారీచేస్తారు. చిత్తూరు జిల్లాలోని కుప్పం, పలమనేరు, జీడీ నెల్లూరు, పూతలపట్టు, నగరి, చిత్తూరు, పుంగనూరుతో పాటు తిరుపతి జిల్లాలోని తిరుపతి, గూడూరు, శ్రీకాళహస్తి, పుత్తూరు, చంద్రగిరి, నాయుడుపేట, సత్యవేడు, వెంకటగిరిలో టపాసుల దుకాణాలు ఏర్పాటు చేస్తున్నారు. ఒక్కొక్క నియోజకవర్గంలో 10 నుంచి 40 వరకు తాత్కాలిక షాపులను పెడుతున్నారు. వీటన్నింటికీ అధికారుల నుంచి తాత్కాలిక అనుమతులు పొందాల్సి ఉంటుంది. చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో తాత్కాలిక టపాసుల దుకాణాల ఏర్పాటుకు అందిన కాడికి దోచుకుంటున్నారు. లంచం ఇవ్వకపోతే ఏదో ఒక కారణంతో కొర్రీలు వేసి అనుమతులు ఇవ్వకుండా ఇబ్బందులు సృష్టిస్తున్నారు.

బిల్లులుండవు.. ట్యాక్స్ చెల్లించరు

వినియోగదారులు వస్తువులు కొన్న తర్వాత దుకాణాదారుడు రసీదు ఇస్తారు. కానీ, టపాసుల విక్రయాల్లో మాత్రం జీరో బిజినెస్ నడుస్తోంది. టపాసులకు సంబంధించి చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో వ్యాపారులు ఎలాంటి బిల్లులు ఇవ్వడం లేదు. దీంతో ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతోంది. విక్రయాలు సాగించిన మొత్తానికి 18 శాతం జీఎస్టీ చెల్లించాలి. అయితే, వ్యాపారులు ఎలాంటి ట్యాక్స్‌లు చెల్లించకుండానే అక్రమ వ్యాపారాలకు తెరలేపుతున్నారు. మరోవైపు టపాసుల రేట్లు సైతం అధికంగా పెంచి విక్రయించే ఆలోచనలో దుకాణాదారులున్నట్లు తెలుస్తోంది. సిండికేట్‌గా మారి అందరూ ఫిక్స్ రేట్లను పెట్టే ఆలోచనలో ఉన్నట్లు సమాచారం.

గుండెపోటుతో న్యాయవాది మృతి



గాంధీ (ఫైల్)

పాలసముద్రం: మండలంలోని పాలసముద్రం దళితవాడకు చెందిన అడ్వొకేట్ గాంధీ శుక్రవారం గుండెపోటుతో మృతి చెందాడు. చిత్తూరు కోర్టు నుంచి స్వగ్రామానికి తిరిగి వస్తున్నప్పుడు 7 గంటలకు గుండె నొప్పిగా ఉందని కుప్పకూలిపోయాడు. వెంటనే తోటి న్యాయవాదులు చిత్తూరు ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరిశీలించి మృతి చెందాడని నిర్ధారించారు.

కుటుంబ కలహాలతో సచివాలయ ఉద్యోగి ఆత్మహత్య



నిరంజన్(ఫైల్)

ఏర్పేడు : ఏర్పేడు మండలంలోని కందాడ దళితవాడకు చెందిన సచివాలయ ఉద్యోగి కుటుంబ కలహాలతో గురు వారం రాతి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఏర్పేడు సీఐ శ్రీకాంత్‌రెడ్డి తెలిపిన వివరాలు. ఏర్పేడు మండలం కందాడ దళితవాడకు చెందిన బొంద మునెయ్య, సాయమ్మ దంపతులకు ముగ్గురు కుమారులు. వారిలో రెండో కుమారుడు బొంద నిరంజన్(27) శ్రీకాళహస్తి మండలం బీవీపురం సచివాలయంలో వెల్ఫేర్ అసిస్టెంట్‌గా ఉద్యోగం చేస్తున్నాడు. కందాడ దళితవాడకు చెందిన సుబ్రమణ్యం, చంద్రికల కుమార్తె విద్యప్రియను ఈ ఏడాది మార్చి 12న వివాహం చేసుకున్నాడు. ప్రస్తుతం నిరంజన్ భార్య విద్యప్రియ గర్భిణి. అత్తమామలు, భార్య వేధింపులకు తోడు అప్పులు ఎక్కువ కావడంతో మానసిక వేదనకు గురయ్యాడు. ఈ క్రమంలో నిరంజన్ గురువారం రాత్రి ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

అమ్మా.. నాన్నా ఇక సెలవు..

మృతుడు నిరంజన్ వద్ద లభించిన సూసైడ్ నోట్‌ను బట్టి అత్తమామలు, భార్య వేధింపులు, అప్పులు ఎక్కువ కావడంతో బలవన్మరణానికి పాల్పడినట్లు పోలీసులు ప్రాథమికంగా అంచనా వేశారు. లేఖలో.. 'పోలీసు వారికి మనవి.. నాకు పెళ్లైనప్పటి నుంచి భార్య, వాళ్ల అమ్మ, హేమలత(పెద్దమ్మ) నన్ను చాలా ఇబ్బంది పెడుతున్నారు. నాభార్య కూడా నన్ను చంపే దాక తీసుకొచ్చింది. దానికి రిలేటెడ్‌గా కాల్‌డేటా తీయండి సార్.. వీళ్ల నన్ను టార్చర్ పెట్టి చంపేసి నా భార్యకు వేరే పెళ్లి చేయాలని చూస్తున్నారు.. మా అమ్మానాన్న, అన్న, వదిన, తమ్ముడును కాపాడండి సార్.. 'అమ్మా.. నాన్నా సారీ నాన్నా.. ఇక సెలవు.. ఇంకో జన్మలో మిమ్మల్ని బాగా చూసుకుంటా..' అంటూ సూసైడ్‌నోట్‌లో నిరంజన్ రాసినట్లు గుర్తించారు.

కష్టపడి పనిచేసే వారికి ప్రాధాన్యం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ భరత్

శాంతిపురం : పార్టీ కోసం కష్టపడి పనిచేసే కార్యకర్తలకు ప్రాధాన్యం ఇస్తామని ఎమ్మెల్సీ, వైఎస్సార్ సీపీ కుప్పం నియోజకవర్గ సమన్వయకర్త కెఆర్జే భరత్ తెలిపారు. మండలంలోని ఏడవమైలు వద్ద శుక్రవారం మొరసనపల్లి, కడపల్లి, కర్లగట్ట, తుమ్మిశి, అబకలదొడ్డి, నడింపల్లి పంచాయతీల పార్టీ కమిటీలు ఎంపిక చేశారు. ఆయన మాట్లాడుతూ గతంలో క్యాడర్‌కు జరిగిన నష్టాన్ని గుర్తించిన అధినేత వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఇకపై వారికి తగిన అవకాశాలు ఇవ్వాలని నిర్ణయించినట్టు తెలిపారు. కమిటీల్లో కోవర్టులు, అవకాశవాదులకు చోటు లేకుండా యువత, సోషల్ మీడియా సభ్యులకు అవకాశం కల్పించాలన్నారు. పంచాయతీల వారిగా క్రియాశీలక కార్యకర్తలు పార్టీ అధినేతతో కలిసే అవకాశం కల్పిస్తామని హామీ ఇచ్చారు. గతంలో అధికారం వుండగా పార్టీలోకి వచ్చిన అవకాశవాదులు ఇప్పుడు పార్టీని వీడారని భరత్ చెప్పారు. వారి వల్లే కుప్పంలో పార్టీ 75 వేల ఓట్లకు పరిమితమైనట్టు తెలిపారు. అన్యాయం జరిగిన వారు, రాజకీయ వేధింపులకు గురయ్యే వారు డిజిటల్ బుక్ నమోదు చేయాలని సూచించారు. చంద్రబాబు ప్రభుత్వం మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ చేయటానికి వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణలో పార్టీ శ్రేణులు చురుగ్గా పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ బుల్లెట్ దండపాణి, పార్టీ ఉపాధ్యక్షుడు కోదండరెడ్డి, ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి, రెస్కో మాజీ చైర్మన్ చక్రపాణిరెడ్డి, ఏవీ జయరాం, జగదీష్, ఆర్ముగం, విజయకుమార్, పట్టాభి, గజ్జల రమేష్, ప్రభాకర్‌రెడ్డి, నగేష్, వీరభద్రప్ప తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కమిటీల అధ్యక్షులు వీరే:

మొరసపల్లి పంచాయతీ పార్టీ అధ్యక్షుడుగా జానకీరాం, గౌరవాధ్యక్షులుగా కాంతారావ్, కొండన్న వెంకటేష్, అబకలదొడ్డి పంచాయతీ అధ్యక్షుడుగా వీరప్ప, గౌరవాధ్యక్షులుగా పి.మణి, ఆదినారాయణ, కడపల్లి పార్టీ అధ్యక్షుడుగా ఎం.మురుగేష్, గౌరవాధ్యక్షులుగా వెంకటస్వామి, వెంకటేష్, తుమ్మిశి పార్టీ అధ్యక్షుడుగా చంగమరాజు, గౌరవాధ్యక్షులుగా టిపి భాస్కర్, ఎండి బాబు, నడింపల్లి పార్టీ అధ్యక్షుడుగా పిఎం రమేష్, గౌరవాధ్యక్షులుగా కృష్ణప్ప, మునివెంకటప్పలతో పాటు ఆయా పంచాయతీ పార్టీ కమిటీలు, అనుబంధ సంఘాలను ఎన్నుకున్నారు.

కాణిపాకం హుండీ ఆదాయం రూ.1.77 కోట్లు



హుండీని లెక్కిస్తున్న ఆలయ అధికారులు, సిబ్బంది

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీవర సిద్ధి వినాయకస్వామి దేవస్థాన హుండీని శుక్రవారం ఆలయ అధికారులు లెక్కించారు. ఈవో పెంచలకిషోర్ పర్యవేక్షణలో జరిగిన ఈ హుండీ లెక్కింపులో రూ.1,77,02,032ల ఆదాయం వచ్చింది. బంగారం 52 గ్రాములు, వెండి 510 కిలోలు లభించింది. అలాగే గోసంరక్షణ హుండీ ద్వారా రూ.16,845, నిత్యాన్నదానం హుండీ ద్వారా రూ.20,699 వచ్చింది. యూఎస్ఏవి 139 డాలర్లు, సింగపూర్‌వి 2 డాలర్స్, మలేషియావి 11 రింగిట్స్, యూఏఈ 25 దిర్హామ్స్, కెనడా 110 డాలర్లు, ఆస్ట్రేలియావి 110 డాలర్స్, యూరోవి 10 యూరోలు వచ్చాయి. డీఈవోలు సాగర్‌బాబు, ఏఈవోలు ఎస్వీ క్రిష్ణారెడ్డి, రవీంద్రబాబు, హరిమాధవరెడ్డి, ప్రసాద్, ధనపాల్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

రాహుకాల అభిషేక పూజలు





బోయకొండలో ప్రత్యేక అలంకరణలో అమ్మవారు , భక్తులతో కిటకిటలాడుతున్న ఆలయం

చౌడేపల్లి: బోయకొండ గంగమ్మ ఆలయంలో శుక్రవారం రాహుకాల అభిషేక పూజలు నిర్వహించారు. రాహుకాల సమయం 10.30 నుంచి 12 గంటల మధ్య అర్చనలు, అభిషేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారిని ముస్తాబు చేసి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు.

22న జాబ్‌మేళా



అధికారులతో కలిసి పోస్టర్లు ఆవిష్కరిస్తున్న తిరుపతి కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి అర్బన్ : కలెక్టరేట్‌లో జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారులతో కలిసి శుక్రవారం జాబ్‌మేళా పోస్టర్‌ను కలెక్టర్ వెంకటేశ్వర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 22న సూళ్లూరుపేట సత్యసాయి కల్యాణ మండపంలో జాబ్ మేళా ఉందని చెప్పారు. తమతో పాటు పలువురు అధికారులు, పలు కంపెనీలకు చెందిన ప్రతినిధులు వస్తారని వెల్లడించారు. ఆసక్తి ఉన్న నిరుద్యోగులు ఈ నెల 20వ తేదీ లోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. 21 కంపెనీలకు చెందిన ప్రతినిధులు వస్తారని వెల్లడించారు. వెయ్యి ఉద్యోగాలు భర్తీ చేస్తారని చెప్పారు. పదో తరగతి నుంచి ఇంటర్, ఏదైనా డిగ్రీ లేదా పీజీ చదువుకున్న యువతి యువకులు అర్హులుగా పేర్కొన్నారు. అదనపు సమాచారం కోసం 9121646661, 9985056929, 9988853335 నంబర్లను సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి లోకనాథం, పరిశ్రమలశాఖ జిల్లా అధికారి చంద్రశేఖర్, ఏపీఐఐసీ జిల్లా మేనేజర్ భరత్‌కుమార్‌రెడ్డి, డీఆర్‌డీఏ అడిషనల్ పీడీ ప్రభావతి, జిల్లా ప్లేస్ మెంట్ అధికారి గణేష్ పాల్గొన్నారు.

రైతు సభను అపహాస్యం చేయడం విడ్డూరం

– పూతలపట్టు ఎమ్మెల్యేకు రైతు నేతలు కౌంటర్

తిరుపతి కల్చరల్ : రైతుల గోడుపై పూతలపట్టులో ఆక్రందన సభ పెట్టుకుంటే దానిని పూతలపట్టు ఎమ్మెల్యే అపహాస్యం చేయడం దుర్మార్గమని, పూతలపట్టు ఎమ్మెల్యే మురళీ మోహన్ జాగీరు కాదని రైతు సంఘాల నేతలు పి.హేమలత, టి.జనార్దన్, సీపీఐ రాష్ట్ర నేత రామానాయుడు ఎమ్మెల్యేకు ఘాటైన సమాధానం చెప్పారు. శుక్రవారం సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. నీ ప్రతాపం మామిడి రైతులపై కాదు, ఫ్యాక్టరీలపై చూపించాలని హితవు పలికారు. మామిడి రైతుకు రూ.8 , సబ్సిడీ రూ.4 కలిపి మొత్తం సొమ్ములు రైతులకు చెల్లించాల్సి ఉండగా ప్రభుత్వం రూ.4 సబ్సిడీ మాత్రమే చెల్లించిందన్నారు. అది కూడా ఆక్రందన సభకు ముందు రోజు విడుదల చేయడం అంటే అది రైతు సంఘం విజయమని తెలిపారు. బంగారుపాళ్యంలో రైతు సభను జరగనీయకుండా ఎమ్మెల్యే అధికారులతో, ప్రవేటు వ్యక్తులతో భయపెట్టి సభ అడ్డుకోవడం దుర్మార్గమన్నారు.40 ఫ్యాక్టరీలను నియంత్రించలేక 40 వేల మంది రైతులకు అన్యాయం చేయడం మీకు తగదన్నారు. మామిడి రైతులకు సమాధానం చెప్పలేక ఎదురుదాడికి పూనుకోవడం బాధాకరమన్నారు. బెదిరింపులతో మామిడి రైతుల ఉద్యమాన్ని అడ్డుకోలేరని హితవు పలికారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఫ్యాక్టరీలు ఇవ్వాల్సిన రూ.370 కోట్ల బకాయిలను తక్షణం ఇప్పించకపోతే జరగబోయే ఉద్యమాలకు మీరే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు.

ఇంకా కనిపించని యువకుడి జాడ



స్నేహితులు సెల్‌ఫోన్ రికార్డింగ్ చేస్తుండగా నీటిలో దూకిన యూనిస్

పలమనేరు: మండలంలోని కళ్యాణి వాటర్ పాల్స్ ప్రవాహంలో గురువారం గల్లంతైన యువకుడి ఆచూకీ ఇంకా లభించలేదు. అగ్నిమాపక సిబ్బంది రెండో రోజు శుక్ర వారం కూడా గాలింపు చర్యలు చేపట్టారు. పలమనేరు పట్టణానికి చెందిన ఫయాజ్ పెద్ద కుమారుడు యూసఫ్(25) చికెన్ షాపులో పని చేస్తున్నాడు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు కళ్యాణి వాటర్‌పాల్స్ ఉద్ధృతంగా ప్రవహిస్తోంది. దీన్ని చూసేందుకు పదిమంది స్నేహితులతో కలిసి గురువారం మధ్యాహ్నం అక్కడికి వెళ్లారు. యూసఫ్ నీటిలో దూకాడు. పైనున్న స్నేహితులు సెల్‌ఫోన్‌లో రికార్డు చేస్తున్నారు. యూసఫ్ నిమిషం వ్యవధిలోనే కనిపించకుండాపోయాడు. స్నేహితులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. వారు వెంటనే అక్కడికి చేరుకుని వెతికినా కనిపించలేదు. గురువారం చీకటి పడడంతో శుక్రవారం గాలింపు చర్యలు చేపట్టారు. వాటర్‌పాల్స్ కొండల నడుమ ఉండడం, నీరు ఇక్కడి నుంచి తమిళనాడులోని మోర్థానా ప్రాజెక్టుకు నీరు చేరుతుండడంతో మృతదేహం ఎక్కడైనా రాళ్లకు, చెట్లకు చిక్కుకుని వుండే అవకాశం ఉందని చర్చించుకుంటున్నారు.

ఉద్యాన పంటల అభివృద్ధే లక్ష్యం



మాట్లాడుతున్న రాష్ట్ర కో-ఆర్డినేటర్



హాజరైన అధికారులు, రైతులు

చిత్తూరు రూరల్(కాణిపాకం): క్లస్టర్ డెవలప్మెంట్ ప్రోగ్రాం (సీడీపీ) కింద ఉద్యాన పంటల అభివృద్ధికి ప్రణాళికలు రూపొందిస్తున్నామని, ఇందుకు కేంద్ర ప్రభుత్వం ఆధీనంలోని నేషనల్ హార్టికల్చర్ మిషన్ సహకారం అందిస్తోందని ఉద్యానశాఖ సీడీపీ రాష్ట్ర కో–ఆర్డినేటర్ విద్యాశంకర్ పేర్కొన్నారు. చిత్తూరులోని జిల్లా ఉద్యానశాఖ కార్యాలయంలో శుక్రవారం ఉద్యాన పంటల క్లస్టర్ల అభివృద్ధి కార్యక్రమంపై ఉమ్మడి జిల్లాల ఉద్యానశాఖ అధికారులు, రైతులతో కలిసి అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటికే పలు పంటలను సీడీపీ పథకం అమలుకు ప్రాథమికంగా అనుమతులిచ్చామన్నారు. 20 శాతం వాటా భరిస్తే...20 శాతం బ్యాంకు రుణం, 20 శాతం సభ్యులైన రైతుల వాటా, మిగిలిన 40 శాతం కేంద్ర ప్రభుత్వ గ్రాంటు రూపంలో అందిస్తుందన్నారు. ఉమ్మడి జిల్లాలో దానిమ్మ, అరటి, టమాట, మిరప తదితర పంటలకు సీడీపీ కింద తీసుకునే అవకాశాలు ఉన్నాయన్నారు. విత్తనం, మొక్కలు, ఎగుమతులు, కల్టివేషన్, పోస్ట్ హార్వెస్టింగ్, బ్రాండింగ్, లాజిస్టిక్స్ అంశాలపై ఏదైన ఒక పంటను ఎంపిక చేసుకున్న సంస్థ తమ దగ్గరున్న వనరులు, మౌలిక సదుపాయాలతో కూడిన ప్రాజెక్టు రిపోర్టు అందిస్తే అనుమతులు జారీ చేస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యానశాఖ అధికారి మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పంటలపై ఏనుగుల దాడి



పూరేడువారిపల్లె వద్ద ఏనుగులు తొక్కేసిన అరటి పంట

పులిచెర్ల(కల్లూరు) : మండలంలోని పాతపేట పంచాయతీ పూరేడువారిపల్లె పరిసర ప్రాంతాల్లో శుక్రవారం తెల్లవారు జామున ఏనుగులు పంటలను ధ్వంసం చేశాయి. పూరేడు వారిపల్లె వద్ద కొబ్బరి చెట్లను పెరికి వేశాయి. తీవ్రంగా నష్టపోయామని, పరిహారం ఇప్పించాలని బాధిత రైతులు కోరుతున్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్



- తిరుపతిలో పనిచేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. 12 గంటలు డ్యూటీ, జీతం: 10,000-16,000. 9030843377, 9704267474.
- తిరుపతి, చెర్లోపల్లి, రేణిగుంటలో సెక్యూరిటీ గార్డ్స్ మరియు హౌస్ కీపింగ్ లేడీస్, నార్త్ ఇండియన్స్ వర్కర్స్ కావలెను. 9492741481, 96426 21438.
- Best Money Gold సంస్థ నందు పని చేయుటకు గూడూరు, నాయుడుపేట, వెంకటగిరి బ్రాంచ్‌లకు Gold field నందు అనుభవం కలిగిన వారు కావలెను. రూమ్ వసతి కలదు. 6384002617.
- కన్సల్టెన్సీ కాదు VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు, ఆయా, నర్సులు, వంటవారు,RMP&డ్రైవర్స్ కావలెను.జీ.15 వేలు -40వేలు,ఫ్రీరూం+భోజనం.Hyd.9014885406

నాలుగులైన్ల ప్రకటనకు : రూ. 375/-
అదనపు లైనుకు : రూ . 90/-
ప్రతి ప్రకటనపై G.S.T 5% అదనం
Contact 9705444178 9951602970

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని విశ్వసించి పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులకు కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బుల ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.